సాక్షి ఆదిలాబాద్

గురువారం । 19 । డిసెంబర్ । 2024



నాగోబా ఆలయ వార్షికోత్సవం

కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయ తృతీయ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులతో పాటు భక్తులు తరలి వచ్చారు. 8లో▸



ప్రకృతిని ఆస్వాదించి..

ఎకో టూరిజం కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణలో ఉన్న 59 మంది బీట్ అధికారులు నిర్మల్ జిల్లాలో పర్యటించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/11.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



శీతాకాలంలో చలి బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం చలితీవ్రత పెరిగింది. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వేకువజామున, సాయంత్రం వేళలో బయటకు రాకపోవడమే మంచిది. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే రక్షణ కవచాలు ధరించాలి. చలి నుంచి చర్మాన్ని కాపాడుకునేందుకు అవసరమైన లోషన్లు వినియోగించాలి. చిన్నారులు, వృద్ధులు ఇంట్లో ఉన్నా స్వెటర్లు ధరించేలా చూడాలి. **– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ,**



జర పైలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రికార్డుస్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే 4డిగ్రీల సెల్సియస్‌కు చేరువైంది. వేకువజామున పొగమంచుకు శీతలగాలులు తోడవుతున్నాయి. పల్లె పట్టణం తేడా లేకుండా జనం వణికిపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటున్నారు.

– మరిన్ని వివరాలు 8లో▸

వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి..



చలికాలంలో వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. బాదాం, వాల్నట్, క్యారెట్, బీట్‌రూట్, పాలక్, మెంథి, ఎల్లిగడ్డ, పుదీన, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా వినియోగించాలి. దోసకాయ, ఐస్‌క్రీమ్, సిట్రస్ ఫలాలు, కొబ్బరిబోండాలు తీసుకోవద్దు. ఇవి చల్లగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతాయి. బేకరీ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఇంట్లో తయారు చేసిన సూప్‌లను ఎక్కువగా తీసుకోవడం మంచిది.

– డాక్టర్ వైశాలి, డైట్ కన్సల్టెంట్

న్యూస్‌రీల్

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



దరఖాస్తుదారు ఇంటిని స్వయంగా ఫొటో తీస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ వార్డు నంబర్ 44, 49లో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వివరాల నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్‌లో దరఖాస్తుదారు ఇంటిని నమోదు చేసేందు కోసం కలెక్టర్ స్వయంగా ఫొటో తీశారు. రోజు వారీ లక్ష్యాలను సాధిస్తూ గడువులో పు సర్వేను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, వార్డు కౌన్సిలర్ ప్రకాశ్ తదితరులున్నారు.

పాఠశాలల పనివేళల్లో మార్పు

కైలాస్‌నగర్: జిల్లాలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల పనివేళల్లో మార్పు చేసినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 19నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈసమయాన్ని పాటించాలని సూచించారు. ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా కలెక్టర్ నిర్ణయంపై టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా చర్యలు తీసుకున్నందుకుగాను కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బల్దియాకు 41 మంది కొత్త ఉద్యోగులు

- 35 మంది వార్డు ఆఫీసర్ల చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి కొత్తగా 41మంది ఉద్యోగులు నియామకమయ్యారు. గ్రూప్–4 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పలు ఉద్యోగాలకు ఎంపికైన సదరు అభ్యర్థులు ఈ నెల 5న పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సభలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. తాజాగా వీరికి మున్సిపల్ శాఖ వరంగల్ ఆర్డీ పోస్టింగ్ కేటాయించడంతో బుధవారం విధుల్లో చేరారు. ఇందులో 35మంది వార్డు అధికారులు, నలుగురు జూనియర్‌అసిస్టెంట్లు,మరోఇద్దరు జూనియర్ అకౌంటెంట్లు ఉన్నారు. వీరంతా మున్సిపల్ కమిషనర్ రాజును కార్యాలయంలో కలిసి తమ జాయినింగ్ ఆర్డర్లను అందజేశారు. కాగా వార్డు అధికారులకు నేడో రేపో పట్టణంలోని వార్డులను కేటాయించే అవకాశముంది.

శారీరక శ్రమ తగ్గడమే వ్యాధులకు మూలం

కైలాస్‌నగర్ : శారీరక శ్రమ తగ్గడమే వ్యాధులకు మూలమవుతుందని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లాలోని ఆయా మండల వైద్యాధికారులు, సైన్స్ ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్లు, మండల రిసోర్స్‌పర్సన్లకు పట్టణంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం బడీడు పిల్లల్లో శారీరక శ్రమ లోపించిందన్నారు. దీంతో చిన్నతనంలోనే వెంట్రుకలు తెల్లబడటం వంటివి జరుగుతున్నాయన్నారు. వారిలో శారీరక శ్రమ పెంచేలా ఆటలు ఆడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అసంక్రమిక వ్యాధుల్లో తొలి రెండు స్థానాల్లో ఉన్న బీపీ, షుగర్ వ్యాధులను నియత్రించాలంటే శారీరక శ్రమతో పాటు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ వంశీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి శిక్షణనిచ్చారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో వైసీ శ్రీనివాస్, ఎన్‌సీడీ పీవో శ్రీధర్, సెక్టోరియల్ ఆఫీసర్ సుజాత్‌ఖాన్, డీటీసీఓ సాధన తదితరులు పాల్గొన్నారు.

ఆ నాలుగేనా..?

- రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ మాయాజాలం
- ఐదేళ్లుగా అవే ఏజెన్సీలు
- వేరే వాటిని అడుగుపెట్టకుండా ఎత్తులు
- కొత్త పోస్టులు మంజూరైతే చాలు.. టెండర్లు లేకుండా వీరికే!
- పోస్టులను రూ.లక్షల్లో అమ్ముకుంటున్నారనే ఆరోపణలు
- 'జిల్లా కమిటీ' పర్యవేక్షణ నామమాత్రమనే విమర్శలు



రిమ్స్ ఆస్పత్రి

సాక్షి,ఆదిలాబాద్: సాధారణంగా ఒక ప్రభుత్వ శాఖలో ఔట్‌సోర్సింగ్ పోస్టులు మంజూరైన పక్షంలో వాటి భర్తీ కోసం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎంప్యానల్మెంట్ జాబితాలోని ఏజెన్సీలను ఆ పోస్టుల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకునేలా ఆహ్వానించాలి. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఏజెన్సీని గుర్తించి వర్క్ ఆర్డర్ అందించాలి. ఆ శాఖలో ఇది వరకు ఓ ఏజెన్సీ ఇతర పోస్టులను నిర్వహిస్తున్నప్పటికీ కొత్త పోస్టుల పరంగా తిరిగి టెండర్లు నిర్వహించి అర్హత సాధించిన ఏజెన్సీకే అప్పగించాలనేది నిబంధన. అయితే రిమ్స్‌లో ఐదేళ్ల క్రితం ఓ నాలుగు ఏజెన్సీలకు పోస్టుల నిర్వహణను అప్పగించారు. తిరిగి కొత్త పోస్టులు మంజూరైనా అందులోనే ఓఏజెన్సీకి అప్పగించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ఏజెన్సీలకే పెద్దపీట..

రిమ్స్‌లో 2019 నుంచి నాలుగు ఏజెన్సీలు మాత్రమే వివిధ ఔట్‌సోర్సింగ్ పోస్టుల నిర్వహణ చేస్తూ వస్తున్నాయి. కొత్త పోస్టులు మంజూరైన ఆ ఏజెన్సీలకే టెండర్లు లేకుండానే అప్పగిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో స్టాఫ్‌నర్సు పోస్టులను ఈ విధానంలో భర్తీ చేయగా అందులో ప్రధానంగా పాత మూడు ఏజెన్సీలకు పంచడమే దీనికి నిదర్శనం. శ్రీ మహాలక్ష్మి మ్యాన్ పవర్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్, ఎలైన్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, జీపీ ఇన్ఫోటెక్ ఏజెన్సీలకు ఆ స్టాఫ్ నర్స్ పోస్టులను ఎలాంటి టెండర్ నిర్వహించకుండానే అప్పగించారు. మహాలక్ష్మి ఏజెన్సీ అయితే ఏకంగా వందలాది పోస్టులను ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తుంది. ఇక ఎలైన్‌సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీ వెనక రిమ్స్ ఉన్నతాధికారి భాగస్వామ్యం ఉందనే విమర్శలూ లేకపోలేదు. జీపీ ఇన్ఫోటెక్ ఏజెన్సీ కూడా రిమ్స్‌లో పెద్ద ఎత్తున ఔట్‌సోర్సింగ్ పోస్టులు నిర్వహిస్తుంది. ఇక దుర్గం ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ రిమ్స్‌లో కొన్ని పోస్టులను నిర్వహణ చేపడుతుంది. జిల్లా ఔట్‌సోర్సింగ్ ఎంప్యానల్మెంట్‌లో 2019లో 17 ఏజెన్సీలు అర్హత సాధిస్తే ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పోస్టులు మంజూరైనప్పుడు కేవలం కొన్ని ఏజెన్సీలకు మాత్రమే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు బాహాటంగా వ్యక్తమవుతున్నాయి.

సగం పోస్టులు రిమ్స్‌లోనే..

జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో కలిపి ఔట్‌సోర్సింగ్ పోస్టులు మొత్తంగా 1,250 వరకు ఉండగా, అందులో 500కు పైగా రిమ్స్ ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోనివే. ఈ పోస్టులను గత ఐదేళ్లుగా ఆ ఏజెన్సీలే నిర్వహిస్తూ వస్తున్నాయి. రిమ్స్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్‌కు సంబంధించిన అనేక పోస్టులను మహాలక్ష్మి ఏజెన్సీ నిర్వహిస్తూ వస్తుంది. సాధారణంగా ప్రతి రెండేళ్లకు కొత్త ఎంప్యానల్మెంట్‌ను గుర్తించాలి. ఆయా శాఖల్లో పోస్టుల నిర్వహణకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను అర్హులైన ఏజెన్సీలకు అప్పగిస్తూ మార్పులు చేర్పులు చేస్తూ ఉండాలి. అయితే ఏళ్లుగా అవే ఏజెన్సీలను కొనసాగిస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులను ఏజెన్సీ నిర్వాహకులను మచ్చిక చేసుకుంటున్నారు.

బాహాటంగా బేరసారాలు..

ఇటీవల రిమ్స్‌లో స్టాఫ్‌నర్స్ ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకంలో ఏజెన్సీలు బాహాటంగా బేరసారాలకు దిగాయి. ఒక్కోపోస్టుకు రూ.2లక్షలకు పైగా వసూలు చేశారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓ అభ్యర్థిని అంతమొత్తం ఇచ్చుకోలేని పరిస్థితిలో స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించడం, ఆ ఎమ్మెల్యే ఈ విషయంలో రిమ్స్ ఉన్నతాధికారిని చివాట్లు పెట్టడం జరిగాయి. అయినప్పటికీ వ్యవహారంలో మార్పు రాలేదని తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలో ఏజెన్సీలు తమ అక్రమ పంథా కొనసాగిస్తుండగా, అధి కారులు దానికి వంతు పాడటం వెనుక ఏదో లోపాయికార ఒప్పందం ఉందన్న విమర్శలు లేకపోలేదు.

రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు ఉన్న పోస్టుల సంఖ్య..

ఏజెన్సీ	పోస్టుల సంఖ్య
శ్రీమహాలక్ష్మి మ్యాన్‌పవర్	325
ఎలైన్‌సాఫ్ట్	63
జీపీ ఇన్ఫోటెక్	86
దుర్గం కోఆపరేటివ్	24

ఎంప్లాయ్‌మెంట్ అధికారిదే బాధ్యత..

రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పోస్టుల నిర్వహణలో ఇతర ఏజెన్సీలకు కూడా మున్ముందు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఇప్పటివరకు ఉన్న ఏజెన్సీలను మార్చే విషయంలో రిమ్స్ అధికారుల పాత్ర ఏమి ఉండదు. ఎంప్లాయ్‌మెంట్ అధికారిదే ప్రధాన బాధ్యత. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం జరుగుతుంది.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

సమ్మెలో 'సమగ్ర' ఉద్యోగులు

- కేజీబీవీల్లో నిలిచిన విద్యాబోధన
- ఈ నెల 10 నుంచి కొనసాగుతున్న సమ్మె
- జిల్లాలో 657 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఈనెల 10 నుంచి విధులు బహిష్కరించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా వినూత్న నిరసనలు చేపడుతున్నారు. దీంతో విద్యా శాఖలో సేవలు నిలిచిపోగా, కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల్లో బోధనపై ప్రభావం చూపుతోంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు సమీపంలో ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని చెబుతున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. అయితే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

657 మంది విధులకు దూరం..

జిల్లాలో 18 కేజీబీవీలున్నాయి. ఇందులో 12 పాఠశాలల్లో ఇంటర్, 17పాఠశాలల్లో పదోతరగతి వరకు విద్యాబోధన సాగుతోంది. జిల్లావ్యాప్తంగా 4,432 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఈ కేజీబీవీల్లో 357 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలాగే పాఠశాలల్లో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు 51మంది,క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు 58మంది,ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 17మంది, సీసీవో లు 13 మంది, మెస్సెంజర్లు 10 మంది, కేర్‌గివర్లు 10 మంది, ఏపీఓ, టీపీ, సిస్టమ్ అనలిస్ట్ ఒక్కరు చొప్పున పనిచేస్తున్నారు.ముగ్గురు డేటాఎంట్రీ ఆపరేటర్లు, నలుగురు ఆఫీస్ సబార్డినేటర్లు విధులు నిర్వహిస్తున్నారు.

నిలిచిన సేవలు..

సమగ్ర ఉద్యోగుల సమ్మెతో విద్యా శాఖలో సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో విద్యాబోధనకు బ్రేక్ పడింది. ప్రస్తుతం నాన్ టీచింగ్ సిబ్బంది మాత్రమే విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. సమగ్ర శిక్షలో కొంత కాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్పీలు సమ్మెలో ఉండడంతో రిపోర్టులు ఆగిపోయాయి. కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు విధులకు హాజరుకాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. భవిత రిసోర్స్ సెంటర్‌లో బుద్ధి మాంద్యం, వైకల్యం గల పిల్లలకు ఐఈఆర్పీలు విద్యాబోధన చేస్తారు. ఆ సేవలు సైతం నిలిచిపోయాయి. మండల విద్యాధికారి కార్యాలయాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెస్సెంజర్లు విధులకు వెళ్లకపోవడంతో ఎంఈఓ కార్యాలయాలకు తాళం పడే పరిస్థితి నెలకొంది.

కొద్ది నెలలుగా ఆందోళన..

సమగ్ర శిక్ష ఉద్యోగులు కొద్ది నెలలుగా ఆందోళన బాట పట్టారు. గత ప్రభుత్వ హయాంలో రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ 2023 సెప్టెంబర్‌లో 29 రోజుల పాటు సమ్మె చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగస్టు 16న అసెంబ్లీ ముట్టడి చేపట్టారు. నవంబర్ 16న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత నాలుగు రోజుల పాటు కలెక్టరేట్ల ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం దిగిరాకపోవడంతో డిసెంబర్ 10 నుంచి సమ్మెను కొనసాగిస్తున్నారు. రోజుకో రీతిలో నిరసనలు చేపడుతున్నారు. వీరికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటిస్తున్నాయి.



శిబిరంలో బుధవారం కళాకారుల ఆటాపాట

తొమ్మిదో రోజుకు సమ్మె..

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరంలో ధూంధాంతో నిరసన తెలిపారు. కళాకారులు అశోక్, లక్ష్మణ్, అశన్న, దత్తు, కబీర్‌ఖాన్ రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఆటపాటలతో హోరెత్తించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు వారితో పదం కలిపి నిరసన వ్యక్తం చేశారు.

డిమాండ్లు ఇవే..

- సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి.
- తక్షణమే పే స్కేల్ ప్రకటించి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- రూ.10లక్షల చొప్పున జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.
- రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్ కింద రూ.25లక్షలు చెల్లించాలి.
- ప్రభుత్వ నియామకాల్లో ఉద్యోగులకు వెయిటేజీ అమలు చేయాలి.
- పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలి.

రెగ్యులరైజ్ చేయాలి..



సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హన్మకొండ వేదికగా హామీ ఇచ్చారు. నెలరోజుల్లో అమలు చేస్తామని చెప్పినప్పటికీ ఏడాది గడిచినా అతీగతీ లేదు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంచేంత వరకు సమ్మెను కొనసాగిస్తాం. ఇప్పటికే 130 మంది ఉద్యోగులు మృతిచెందారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్, పేస్కేల్ అందిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలి.

– పడాల రవీందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి

ఉత్తమ పాఠశాల @ మన్నూర్ జెడ్పీఎస్ఎస్

- మల్టీజోన్–1 నుంచి ఎంపిక



మన్నూర్ జెడ్పీఎస్ఎస్

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల మల్టీజోన్–1 నుంచి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. జాబితాలో జిల్లా నుంచి ఇది ఒక్కటే ఉండడం గమనార్హం. ఈ పాఠశాలకు ఎనిమిది దశాబ్దాల చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం రాక ముందే అంటే 1937లోనే ఈ బడి ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు విద్యా సేవలందిస్తూ ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దింది. విశాలమైన ఆట స్థలం, సరిపడా తరగతి గదులతో మూడు భాషల్లో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ తెలుగు, మరాఠీ, ఆంగ్ల మాధ్యమాలను నిర్వహిస్తున్నారు. మొత్తం 410 మంది విద్యార్థులున్నారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించడంతో పాటు ఏటా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఫలితాలను సాధిస్తుండడం గమనార్హం. అంతేకాకుండా ఇక్కడి విద్యార్థులు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం. వెరసి జోనల్‌స్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో ఎంఈవో ఉదయ్‌రావ్, హెచ్ఎం ఎస్.సంతోష్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన బోథ్ ఎమ్మెల్యే..

- నియోజకవర్గ సమస్యలను విన్నవించిన అనిల్ జాదవ్



సీఎంను కలిసి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ సమస్యలు, ప్రజల ఆకాంక్షలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా బోథ్ రెవెన్యూ డివిజన్ అంశాన్ని ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. నేరడిగొండ మండలంలో కుప్టి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించాలని, పిప్పల్‌కోటి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించాలని, ఇచ్చోడలో పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బరంపూర్ నుంచి మోర్కండి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు ఇచ్చి రహదారిని పూర్తి చేయాలన్నారు. సిరిచెల్మలోని పురాతన మల్లికార్జున ఆలయం, బరంపూర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం అసెంబ్లీలో మాట్లాడారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మూడేళ్లుగా డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- మావల పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మావల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. నమోదైన కేసుల వివరాలు తెలుసుకొని పెండింగ్ వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో పూల మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో గస్తీ పెంచాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐ కె.ఫణిధర్, మావల ఎస్‌హెచ్‌వో విష్ణువర్ధన్, ఎస్సై పవర్ గౌతమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

96 మంది విద్యార్థులు.. ఒక్కరే టీచర్!



పాఠశాలలో విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు తిరుమల

నార్నూర్: సమస్యల పరిష్కారం కోసం సీఆర్టీలు ఈనెల 16 నుంచి సమ్మె బాట పట్టిన విషయం విదితమే. అయితే ఏజెన్సీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధనలో సీఆర్టీలే కీలకం. ప్రస్తుతం వారు సమ్మెలో ఉండడంతో మూడు రోజులుగా బోధించేవారు లేక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. మండలంలోని భీంపూర్ ఆశ్రమ పాఠశాలలో మొత్తం 222మంది విద్యార్థులున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 96 మంది విద్యార్థులుండగా.. ముగ్గురు సీఆర్టీలు, ఒకరు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు 126 మంది విద్యార్థులు ఈ వసతి గృహంలోనే ఉంటూ సమీపంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో ఉన్న ముగ్గురు సీఆర్టీలు సమ్మె బాట పట్టడంతో ప్రధానోపాధ్యాయురాలు మేస్రం తిరుమల ఒక్కరే వసతి గృహ నిర్వహణతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను చూసుకోవాల్సిన పరిస్థితి. మూడు రోజులుగా విద్యా బోధన నిలిచిపోవడంతో విద్యార్థులు ఆటపాటలతో కాలం వెలదీస్తున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

- డీఈవో ప్రణీత



విజేతలతో డీఈవో ప్రణీత

కైలాస్‌నగర్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత అన్నారు. బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 16 మండలాల నుంచి 72 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ఎంపిక చేశారు. తెలుగు మీడియం విభాగంలో తాంసి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.బిందుజ ప్రథమ స్థానంలో నిలువగా, జైనథ్ మండలం కూర జెడ్పీహైస్కూల్ విద్యార్థి ఏ.హరిప్రియ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో బోథ్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యారి ఏ.స్నితికారెడ్డి ప్రథమ స్థానం, బంగారుగూడ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి బి.హర్షవర్ధన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి డీఈవో చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఇందులో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ఎంఈవో సోమయ్య, డైట్ వైస్‌ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కంటె నర్సయ్య, ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి పొచ్చారెడ్డి, జి.సత్యనారాయణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఆర్టీల సమ్మెతో మూతబడ్డ పాఠశాలలు



దర్బతండాలో మూతపడ్డ పాఠశాల

నేరడిగొండ: సీఆర్టీల సమ్మెతో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. దీంతో ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. మండలంలోని రేంగన్‌వాడి, దర్బతండా, బుర్కపల్లి, దంషాతండా, గోవింద్‌పూర్, నంద్యనాయక్ తండా, పీచర, లక్ష్మీపూర్, అద్దాల తిమ్మాపూర్, పట్‌పట్‌తండా, ఏసుగూడ గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు సీఆర్టీల సమ్మెతో మూసి ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీఆర్టీల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు తెరవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

21న బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

రామకృష్ణాపూర్: ఈ నెల 21న మంచిర్యాల జిల్లా ఏసీసీలోని శ్రీఉషోదయ హైస్కూల్ గ్రౌండ్‌లో అండర్–13, అండర్–15 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే విద్యార్థులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849444744 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సింగరేణి స్క్రాప్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న స్క్రాప్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం బోయపల్లి, బెల్లంపల్లి తదితర ఏరియాల్లోని స్క్రాప్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ.40వేల విలువైన సింగరేణి స్క్రాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్క్రాప్ దుకాణాల్లో సింగరేణి పరికరాల క్రయవిక్రయాలు జరుపరాదని తెలిపారు. స్వాధీనం చేసుకున్న స్క్రాప్‌ను మందమర్రి ఏరియా ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్‌కు తరలించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

కవ్వాల్‌లో ఏజీప అధికారుల పర్యటన



సఫారీలో పర్యటిస్తున్న అధికారులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లో అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అధికారులు పర్యటించారు. పంజాబ్‌కు చెందిన పంకజ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్‌వర్మ బుధవారం జన్నారానికి చేరుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు ఆదేశాల మేరకు డీఆర్వో తిరుపతి, బీట్ అధికారి లాల్‌బాయి వారిని సఫారీ ద్వారా అడవుల్లోకి తీసుకెళ్లారు. గొండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, మల్యాల వాచ్ టవర్ వరకు సఫారీ ప్రయాణం చేశారు. వన్యప్రాణులను చూసి మురిసిపోయారు. గడ్డి క్షేత్రాలు, నీటి కుంటల గురించి తెలుసుకున్నారు.

చలికాలం.. జర భద్రం



- 4డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఇళ్లకే పరిమితమవుతున్న జనాలు
- ఇబ్బందుల్లో చిన్నారులు, వృద్ధులు
- చలితో పంటల ఎదుగుదల లోపం
- అప్రమత్తంగా లేకుంటే అనర్థాలు

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు చలికి గజగజా వణికిపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్, బేల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదవుతున్నాయి. వారం క్రితం కనిష్ట ఉష్ణోగ్రతలు 12 నుంచి 15 డిగ్రీలుగా ఉండగా, ప్రస్తుతం 4నుంచి 6డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. పొగమంచు కురుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భిన్న వాతావరణానికి నెలవు. వానాకాలంలో వర్షాలు, వేసవిలో ఎండలు, శీతాకాలంలో చలి తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం చల్లటి గాలులు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అత్యవసరమైతే స్వెటర్లు, ఇతర రక్షణ కవచాలు ధరించి బయటకు వెళ్తున్నారు. ఉదయం, రాత్రి వేళ గ్రామాల్లో ప్రజలు చలి మంట వేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చలి కారణంగా పంటల ఎదుగుదల లోపిస్తుండగా, పశువులు కూడా ఇబ్బందులు పడుతున్నాయి.

కమ్ముకుంటున్న పొగమంచు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో గతేడాది ఉష్ణోగ్రతలు 3డిగ్రీలకు పడిపోయాయి. కాగా, ఇప్పటివరకు ఇంత తక్కువ ఉష్ణోగ్రత నమోదు కాలేదని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకోవడంతో బయటకురాలేని పరిస్థితి ఉంటోంది. రాత్రి 6 గంటలు దాటితే జిల్లాలో చలిపంజా విసురుతోంది. గ్రామాలు, అటవీ పరిసర ప్రాంతాల్లో చలి మరింత తీవ్రంగా ఉంటోంది.

పశువులకు టీకా వేయించాలి



చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పశువులను కొట్టాల్లో ఉంచాలి. చలి కారణంగా పాల దిగుబడి తగ్గుతుంది. పశువులకు వెచ్చదనం కోసం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కుక్కలకు సంబంధించి క్రాప్ సీజన్. ఎలర్జీ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కోళ్లకు కొక్కెర వ్యాధి వస్తుంది. టీకాలు వేయించాలి.

– కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఆదిలాబాద్

పరికరాలతో జాగ్రత్త



బెల్లంపల్లి: చలి ప్రభావం ఎలక్ట్రానిక్ పరికరాలపై పడుతుంది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ వినియోగంలో కనీస జాగ్రత్తలు తప్పనిసరి. నిర్లక్ష్యం చేస్తే అవి సరిగా పని చేయవు. సెల్ చార్జింగ్ 10శాతానికి పడిపోతే వెంటనే చార్జింగ్ పెట్టుకోవాలి. చార్జింగ్ పెట్టుకునే అవకాశం లేకుంటే స్విచ్ఛాప్ చేయాలి. సెల్ చార్జింగ్ 100 శాతం కాగానే వెంటనే రిమూవ్ చేయాలి. రాత్రి పూట చార్జింగ్ పెట్టి నిద్రపోతే బ్యాటరీ హీటెక్కి చిప్ ఓవర్ హీట్‌తో డిఫాల్ట్ అవుతుంది.

– జే శేఖర్, సెల్‌ఫోన్ మెకానిక్, బెల్లంపల్లి

వేడి ఆహారం తీసుకోవాలి



నిర్మల్‌చైన్‌గేట్: చలికాలం జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. జ్వరం, జలుబు, దగ్గుతో పాటు చలి గాలులకు కండరాల నొప్పులు వచ్చే ప్రమాదముంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు బయటకు వెళ్తే ఉన్ని దుస్తులు ధరించాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్, నిర్మల్

పెంపుడు కుక్కలు జాగ్రత్త



నిర్మల్‌చైన్‌గేట్: పెంపుడు కుక్కలను ఉదయం 9నుంచి సాయంత్రం 5లోపే బయటి వాతావరణంలో ఉంచాలి. కోళ్లలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాటికి విటమిన్, మినరల్స్ ఎక్కువ మోతాదులో ఉండే ఆహారం అందించాలి. పాల దిగుబడి తగ్గకుండా దాన, తౌడు మిశ్రమాలు అందించాలి. – డాక్టర్ మహేశ్, పశుసంవర్ధకశాఖ అధికారి, నిర్మల్

పొగమంచుతో ప్రమాదాలు



పొగమంచు దట్టంగా కురిసే సమయంలో వీలైనంత వరకు వాహనాలు నడపకుండా ఉంటే మంచిది. మంచు ఎక్కువగా కురుస్తున్నప్పుడు సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే వాహనాల్లో ప్రయాణించాలి. పొగమంచు ఎక్కువగా ఉంటే వాహనాన్ని నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహన డ్రైవర్ గమనించేలా హెడ్‌లైట్స్ ఆన్ చేసి ఉంచాలి. లారీలు, బస్సులు, ఇతర వాహనాలకు ఉండే అద్దాలపై ఉన్న వైజర్లను ఆన్ ఆఫ్ చేస్తుండాలి. దీంతో మంచు కురిసినా అద్దం క్లియర్‌గా కనబడుతుంది.

– శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖ అధికారి, ఆదిలాబాద్

అప్రమత్తంగా ఉండాలి



శీతాకాలంలో పిల్లలు, వృద్ధులు, గర్భిణుల పట్ల జాగ్రత్త వహించాలి. ఆరు నెలల్లోపు చిన్నారులకు రెండు, మూడురోజులకోసారి స్నానం చేయించాలి. స్వెటర్లు, చేతికి గ్లౌస్‌లు, తలకు టోపీ ధరించాలి. వృద్ధులు, గర్భిణులు ఉదయం పూట వాకింగ్ చేయకుండా ఇంట్లోనే ఉండటం మంచిది. జలుబు, దగ్గు ఉన్నవారు గోరువెచ్చని నీళ్లు తాగాలి. యాంటీబయాటిక్ మందులు వాడకూడదు. అవసరమైతే వైద్యుల సూచన మేరకే వినియోగించాలి. ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ హేమలత, అసోసియేట్ ప్రొఫెసర్, రిమ్స్

పంటల్లో ఎదుగుదల లోపం



నవంబర్, డిసెంబర్‌లో పంటల ఎదుగుదల లోపిస్తోంది. నేల నుంచి పోషకాలు మొక్కలు తీసుకోలేని పరిస్థితి ఉంది. దీంతో మొక్కల ఆకులు పండుబారి ఎదుగుదల నిలిచిపోతుంది. శనగ, జొన్న, మక్క, గోధుమ, పెసర, వరి తదితర పంటలకు నీటిలో కరిగే ఎరువు (19:19:19 లేదా 20:20:20 లేదా 13:0:45) వేయాలి. సూక్ష్మధాతులు స్ప్రే చేయాలి. జింక్, ఇనుము, బోరాన్ లోపాలు వస్తే నివారణకు ఫార్ములా–4, ఫార్ములా–6 అగ్రోమిన్ మొక్కల ఎదుగుదలను బట్టి 350నుంచి 500 గ్రాముల వరకు పిచికారీ చేయాలి.

– శ్రీధర్ చౌహాన్, వ్యవసాయ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీదర్శన్

భైంసా: ఉన్నత విద్యను అభ్యసించే ప్రతీ విద్యార్థి జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్ సూచించారు. బుధవారం బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు 'బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీదర్శన్ మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తమకు తాముగా ఎదగాలని, బలమైన ఆలోచనలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. విజయం సాధించడంలో వ్యక్తిగత పాత్ర కీలకమని చెప్పారు. ప్రవర్తన ప్రత్యేకమున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎలా రాణించాలనే విషయాలపై ప్రతీ విద్యార్థి ముందస్తుగా ఆలోచించి అందుకు తగ్గట్లు నడుచుకోవాలన్నారు. ఒత్తిడిని సమర్థవంతంగా జయించడం, ఎలాంటి పరిస్థితుల్లోనూ సహనాన్ని కోల్పోకుండా ఉండడం అనే అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. గొప్పవ్యక్తులు రాణించిన తీరు, వారి జీవన విధానాలను తెలుసుకుని అలాంటి మార్గంలోనే నడుచుకోవాలని చెప్పారు. సరైన ఆలోచన విధానం, వ్యూహాలతో ముందుకువెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఏవో రణధీర్‌సాగి, డాక్టర్ విఠల్, కౌన్సిలర్ నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య



గెడాం శంకర్ (ఫైల్)

తాంసి: పంటచేనులో పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆతర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భీంపూర్ మండలం గోముత్రిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోముత్రి గ్రామానికి చెందిన గెడాం శంకర్ (37) ఈ నెల 12వ తేదీన తన పంటచేనులో కుమారుడితో కలిసి పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. మందు పిచికారీ చేసిన తర్వాత మధ్యాహ్న సమయంలో కుమారుడిని మిగతా మందు పిచికారీ చేయమని చెప్పి చెట్టు కింద కూర్చున్నాడు. కుమారుడు పని పూర్తి చేసుకుని చెట్టు దగ్గరకు రాగా తండ్రి కనిపించలేదు. చుట్టుపక్కలా, బంధువుల్లో ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 14వ తేదీన భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని శంకర్ భార్య పుష్ప ఫిర్యాదు చేసింది. కాగా, పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అందర్‌బండ్ గ్రామశివారులోని జెండగూడ ప్రాజెక్ట్ సమీపంలో శంకర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శంకర్ మృతదేహంగా గుర్తించి అతడి భార్యకు పుష్పకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భీంపూర్ కలీం తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



చిన్న భూమన్న (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన చాకటి చిన్న భూమన్న (50) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న భూమన్న ఈనెల 5నుంచి కనిపించడం లేదంటూ 8వ తేదీన అతడి భార్య భారతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం కుస్లి గ్రామ శివారులోని ఊరగుట్టపై గల టేకుచెట్టు కొమ్మకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు వేణుగోపాల్ ఘటనాస్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. అనారోగ్య సమస్యతో భూమన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కడెం: అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని (ఖానాపూర్ మండలంలో) సింగాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగాపూర్ గ్రామానికి చెందిన మచ్చ పరమేశ్వర్ (35) ఈనెల 17న రాత్రి తన బెడ్రూంలో ఒక్కడే నిద్రించాడు. తెల్లవారి కుటుంబ సభ్యులు చూడగా అనుమానాస్పదంగా మరణించి కనిపించాడు. అతడి భార్య దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. వయస్సు 35–40 ఏళ్ల ఉంటుంది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659924 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై కేసు

దండేపల్లి: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం., ఏవో అంజిత్ ఈనెల 14న మండలంలోని కొత్తమామిడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడుతున్న క్రమంలో అక్కడే ఉన్న గ్రామానికి చెందిన నలిమెల సుధాకర్ అలియాస్ సుధీర్ ఏవో విధులకు ఆటంకం కలిగించాడు. అతడిని బూతులు తిట్టి చంపుతానని బెదిరించాడు. దీంతో ఏవో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వివరించారు.


ముళ్లపందులను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ బైపాస్ వద్ద ముళ్లపందులు తరలిస్తున్న ఇద్దరిని బుధవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్‌ఆర్వో రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన పుట్ట విజయ్, నాగరాజు దిలావర్‌పూర్ అటవీ ప్రాంతంలో ముళ్లపందులు చంపి జిల్లా కేంద్రంలో విక్రయించడానికి వచ్చారు. కాగా, ముందస్తు సమాచారం మేరకు కొండాపూర్ బైపాస్ వద్ద ఫారెస్ట్ అధికారులు వారి బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న సంచిలో ముళ్లపందులను గుర్తించారు. బైక్ జప్తు చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అటవీ శాఖ అధికారులు అనిత, సంతోష్‌కుమార్, ఇర్ఫాన్, నజీర్‌ఖాన్, శ్వేత, సుధాకర్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బెల్లంపల్లి: పట్టణంలోని పేకాట స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పరిధి కన్నాల బస్తీలో ఏలూరి రవి ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారం అందుకుని ఆకస్మికంగా దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లు, నిర్వాహకుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10,610 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో మెరిసిన ఆర్టీసీ కానిస్టేబుల్



తిరుపతిని సన్మానిస్తున్న సోలోమన్

ఆదిలాబాద్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి పోటీలో విజేతగా నిలవడంతో తిరుపతిని బుధవారం ఆదిలాబాద్ ఆర్ఎం కార్యాలయంలో ఆర్ఎం సోలో మన్ సన్మానించారు. డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్ కుమార్, ఏవో శంకరయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ శివదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని ఆస్వాదించి.. పాఠాలు నేర్చుకుని..



యెంగన్న చెరువు వద్ద శిక్షణ బీట్ అధికారులు



క్యాంపుఫైర్‌లో అటవీశాఖ అధికారులు

- బర్డ్‌వాక్, నేచర్ క్యాంప్‌లో ట్రైనీ బీట్ అధికారులు

మామడ: ఎకో టూరిజం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణలో ఉన్న 59 మంది బీట్ అధికారులు హైదరాబాద్ నుంచి వచ్చి నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మదుర్తి అటవీక్షేత్రంలో పర్యటించారు. నల్దుర్తి తుర్కం, పొన్కల్ యెంగన్న చెరువులను సందర్శించారు. అటవీశాఖ అధికారులు వీరికి ఇక్కడి వనరుల వివరాలను పాత్యాంశ రూపంలో వివరించారు. చెరువులకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వలస పక్షులను గుర్తించి వివరాలు సేకరించారు. తుర్కం చెరువు వద్ద ఏర్పాటు చేసిన గుడారాలకు మంగళవారం చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం కాలినడకన యెంగన్న చెరువుకు చేరుకుని అక్కడికి వచ్చిన పక్షులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలోని జీవ, జంతు జాలాలను పరిశీలించారు. వివిధ దేశాల నుంచి వలస వచ్చిన పిగ్మి, వుడ్‌పెక్కర్, ఎల్లో త్రోటెడ్ స్పారో, ఫిష్ ఈగిల్, ఓటర్ వంటి పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు, ఎఫ్ఎస్‌వోలు శ్రీనివాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కడెం: మండలంలోని కవ్వాల్ అభయారణ్యం పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేటలో 60 మంది ట్రైనీ ఎఫ్‌బీవోలు పర్యటించారు. వీరికి అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, కవ్వాల్ టైగర్ జోన్‌లో నుంచి గ్రామల తరలింపు, పునరావాసంలో భాగంగా కల్పించిన వసతుల గురించి ఎఫ్ఆర్వో గీతారాణి అవగాహన కల్పించారు.

జోరుగా నాసిరకం సరుకుల విక్రయాలు



ఇచ్చోడలోని స్వీట్ హౌస్‌లకు సరఫరా చేస్తున్న వస్తువులు

ఇచ్చోడ: నియోజకవర్గంలోని ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్, బోథ్ మండలాల్లోని పలు రాజస్థాన్ స్వీట్‌హౌస్‌లకు ఆర్మూర్ ప్రాంతానికి చెందిన మరో రాజస్థాన్ వ్యాపారి నాసిరకం సరుకులు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో కొందరు స్థానికులు అడ్డుకోవడంతో నాసిరకం సరుకులు సరఫరా చేసే వ్యక్తులు వాహనంతో పరారయ్యారు. కొద్దిరోజులుగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆరు మండలాల్లో కొంతకాలంగా రాజస్థాన్‌కు చెందిన స్వీట్‌హౌస్‌లు, బేకరీల వ్యాపారులు నాసిరకం సరుకులు దిగుమతి చేసుకుని వాటితో తయారు చేసిన స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు సామన్య, మధ్యతగతి ప్రజలకు అంటగట్టి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. స్వీట్ హౌస్‌లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించకపోవడం కూడా వారికి కలిసివస్తోంది. సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తే అసలు విషయం బయటకు పడే అవకాశముంది. నాసిరకం సరుకుల సరఫరాపై ఆదిలాబాద్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ను వివరణ కోరగా, ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి శాంపిళ్లు సేకరించనున్నట్లు తెలిపారు.

వైభవంగా నాగోబా ఆలయ వార్షికోత్సవం



గర్భగుడిలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదివాసీ ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మూడో వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. పిప్రి గ్రామానికి చెందిన కొడప వినాయక్‌రావ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెస్రం వంశీయులతో పాటు భక్తులు తరలి వచ్చి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సప్తాహ కార్యక్రమంలో కుమ్ర దత్త మహరాజ్, మెస్రం వంశం ప్రధాన్ పెద్దల ఆధ్వర్యంలో నాగోబా ఆలయ చరిత్ర, మెస్రం వంశీయుల చరిత్ర వివరించారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్నుపటేల్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, దాదారావ్, కోసేరావ్, షేక్‌నాథ్, జంగు, బాదిరావ్, నాగ్‌నాథ్, తుకారాం, ఆనంద్‌రావ్ తదితరులున్నారు.

ఒకరికి ఏడాది జైలు

ఆసిఫాబాద్: రోడ్డు ప్రమాదంలో కారుతో ఢీకొని ఒకరి మృతికి కారణమైన రెబ్బెన మండలం ఖైర్‌గాంకు చెందిన మానం విజయ్‌కు ఏడాది జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్లు రెబ్బెన ఎస్సై బుద్దెస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో నివాసముంటున్న పడిగెల విజయ్‌కుమార్ 2019 సెప్టెంబర్ 30న రాత్రి 11.00 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు వెళ్తున్న తన భార్య అరుణను కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ట్రెయిన్ ఎక్కించి ద్విచక్రవాహనంపై ఆసిఫాబాద్‌కు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఖైర్‌గాం సమీపంలో ఎదురుగా కారులో అతివేగంగా వస్తున్న మానెం విజయ్ ఢీకొట్టగా మోటార్‌సైకిల్‌పై ఉన్న పడిగెల విజయ్‌కుమార్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పీపీ ఎలిశ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువవడంతో న్యాయమూర్తి పై తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.